సాక్షి
బాపట్ల
ఆదివారం । 1 । డిసెంబర్ । 2024



కాళికాంబకు విశేష పూజలు

కర్లపాలెం: స్థానిక కాళికాంబ సమేత వీరభద్రస్వామి ఆలయంలో శనివారం రాత్రి విశేష పూజలు నిర్వహించారు. ఆలయం ముందు 11కేజీల కర్పూరాన్ని వెలిగించారు.



కార్తిక మాస హోమాలు

తెనాలి: స్థానిక మారిస్‌పేటలోని శ్రీకోదండ రామస్వామి దేవస్థానంలో కార్తిక మాసం సందర్భంగా శనివారం హోమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి గుంటూరు జిల్లా పెదకాకానికి చెందిన కోనూరి శివరామకృష్ణ కుటుంబం రూ. 1,01,116 అందజేశారు.

రైతుల గుండెల్లో జలదరింపు

- ఫెంగల్ మిగిల్చిన విషాదం
- నేల రాలిన ఆశలు
- ఈదురు గాలులతో వర్షం
- పలుచోట్ల నేలకొరిగిన వరి పైరు
- కట్టలు కట్టుకుంటూ కాపాడుకునే ప్రయత్నంలో రైతులు
- ఆదుకోవాలని ప్రభుత్వానికి వినతి

చివరికి మిగిలింది కన్నీరే !





కూచినపూడిలో నేల వాలిన వరి పైరును నిలబెడుతున్న రైతులు (ఇన్‌సెట్‌లో) భట్టిప్రోలు-రేపల్లె రహదారిలో ధాన్యాన్ని పట్టాపై ఆరబోస్తున్న దంపతులు

రేపల్లె రూరల్ /భట్టిప్రోలు / వేమూరు : ఫెంగల్ తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు ఈదురు గాలులు తోడవ్వడంతో భట్టిప్రోలు నియోజకవర్గంలో పలుచోట్ల వరి నేలకొరిగింది. ఆరుగాలం కష్టించి పండించిన పంట చివరి దశలో చేతికి అందకుండా పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తుఫాను ప్రభావంతో శనివారం తెల్లవారుజాము నుంచి నియోజకవర్గంలోని పలు మండలాల్లో విడతల వారీగా వర్షంతో పాటు ఈదురు గాలులు వీస్తున్నాయి. పంటలకు భారీ నష్టం వాటిల్లింది. ముఖ్యంగా వరికి తీవ్ర నష్టం కలిగింది. కళ్ల ఎదుటే చేతికంది వచ్చిన పంట నేల కొరగడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. నేల వాలిన పంటను పైకి లేపి కట్టలు కట్టుకుంటున్నారు.

అప్పులు చేసి సాగు

కూటమి ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించక పోవడంతో అప్పులు చేసి మరి సాగు చేశామని, చివరి దశలో వచ్చిన తుఫాను తీవ్రనష్టం మిగుల్చుతోందని ఆందోళన చెందుతున్నారు. పంట నేలవాలటంతో కోతకు కూడా అధిక మొత్తంలో చెల్లించాల్సి రావటంతో పాటు దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఖరీఫ్‌లో నియోజకవర్గంలో 68,721 ఎకరాలలో వరి పంట సాగులో ఉంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రెండు వేల ఎకరాలకుపైగా వరిపంట నేలకొరిగింది. తుఫాను ప్రభావంతో వర్షం ప్రభావం పెరిగితే మరింత పంట నాశనమయ్యే అవకాశాలు ఉన్నాయి.

పంట వర్షార్పణం

వర్షాలకు నియోజవర్గంలోని పలు ప్రాంతాలలో వరి పంట నేల వాలింది. రేపల్లె మండలంలోని అరవపల్లి, నల్లూరుపాలెం, పోటుమెరక, తుమ్మల, పేటేరు, మోర్లవారిపాలెం, తురకపాలెంలతో పాటు నిజాంపట్నం మండలం అడవులదీవి, కూచినపూడి, నగరం మండలంలోని ఈదుపల్లి, పూడివాడ, చినమట్ల పూడి, పెదపల్లి తదితర గ్రామాలలో వందలాది ఎకరాలతో పాటు చెరుకుపల్లి మండలంలోనూ కొంత మేర వరి పంట నేలకొరిగింది. కన్నబిడ్డలా సాకిన పంట వర్షార్పణం కావడంతో రైతుల ఆశలు అడియాసలయ్యాయి.

గుండెల్లో గుబులు

వేమూరు నియోజకవర్గంలో శనివారం ఉదయం నుంచి ఆడపాతడపా వర్షం కురుస్తుండటంతో రైతులు పంటలను కాపాడేందుకు నానా అవస్థలు పడ్డారు. కల్లాలో ధాన్యం తడవకుండా పట్టాలు కప్పారు. అయినా రైతుల గుండెల్లో గుబులు గానే ఉంది. భారీ వర్షం కురిస్తే పట్టాలు కప్పినా ప్రయోజనం ఉండదని, ధాన్యం దెబ్బ తింటుందని వాపోతున్నారు. నియోజకవర్గంలోని వేమూరు, కొల్లూరు, భట్టిప్రోలు, అమర్తలూరు, చుండూరు మండలాల్లో పలుచోట్ల ఈదురు గాలులకు వరి నేల వాలింది. దీనివల్ల కంకులు దెబ్బతింటాయని వాపోతున్నారు.

వెన్ను విరిగిన రైతన్న



వల్లువారిపాలెంలో కోత కోసిన పొలంలో నిలిచిన నీరు

బాపట్ల: అష్టకష్టాలు పడి సాగు చేసుకున్న పైర్లు చేతికొచ్చే తరుణంలో రుణుడు అన్నదాతలను అనునిత్యం కలవరపాటుకు గురి చేస్తున్నాడు. గత వారం రోజుల నుంచి వాతావరణం అనుకూలంగా ఉండటంతో నియోజకవర్గంలో అడపాదడపా కోతలు ప్రారంభించారు. పొలం పనుల్లో బిజీగా ఉన్న రైతులకు ప్రస్తుతం ఫెంగల్ తుఫాన్ కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. బాపట్ల నియోజకవర్గంలోని బాపట్ల, కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాల్లో వరి పైర్లు 15 రోజుల క్రితమే కోతకు సిద్ధమయ్యాయి. బాపట్ల నియోజకవర్గంలో మొత్తం 37,500 ఎకరాల్లో రైతులు వరిసాగు చేస్తున్నారు. వర్షంతో పాటు వీస్తున్న ఈదురు గాలులకు పైరు నేలకు ఒరిగిపోతోంది.కోతలకు వచ్చిన పైరు దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. కొన్ని చోట్ల గింజ రాలిపోవటంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మరో వైపు కోతలు కోస్తే పైర్లు ఎక్కడ నీటమునిగిపోతాయోనన్న భయంతో కొట్టుమిట్టాడుతున్నారు.

అయిన కాడికి అమ్ముకున్నా..



నేను అర ఎకరా సొంతం, కొంత కౌలు సాగు చేశాం. ఈ వర్షాలకు పంట దెబ్బ తింటుందనే ఉద్దేశంతో అయిన కాడికి మిల్లర్‌కు రూ. 1470కు విక్రయించేందుకు సిద్ధపడ్డా. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తే రెండు రోజుల్లో ఖాతాల్లో జమ చేస్తామని అంటున్నప్పటికీ అవి పడతాయో లేదో నమ్మకం లేదు. ఇప్పటికే ఎకరాకు కౌలు రూ. 30 వేలు, ఖర్చుల కింద రూ. 25 వేలు పెట్టాను. ఇవన్నీ వచ్చే వాటికి సరిపోతాయి. ఇక రెక్కల కష్టమే మిగిలింది.

–తాడికొండ చిన వరప్రసాద్, పెరవలి (భట్టిప్రోలు)

సమస్యల పరిష్కారం కోసమే 'పల్లె నిద్ర'

అడిషనల్ ఎస్పీ టి.పి. విఠలేశ్వర్



జే.పంగులూరు: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల సమస్యలు తెలుసుకొని ఎప్పటికప్పుడు పరిష్కార మార్గం చూపేందుకు.. యువకులు తప్పుదోవ పట్టకుండా ఉండేదుకే పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అడిషనల్ ఎస్పీ టి.పి. విఠలేశ్వర్ పేర్కొన్నారు. మండల పరిధిలోని పంగులూరులో శుక్రవారం రాత్రి ఆయన ఆధ్వర్యంలో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు, ప్రజల మధ్యకి పోలీసు వెళ్లాలనే ఉద్దేశంతో జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని చెప్పారు. ఇందులో భాగంగా జిల్లా పోలీసు అధికారులు ప్రతి శుక్రవారం వారి పరిధిలోని గ్రామాల్లో బస చేస్తారని తెలిపారు. గ్రామస్తులతో సమావేశాలు ఏర్పాటు చేసి, వారి సమస్యలు తెలుసుకుంటారని చెప్పారు. అనంతరం పంగులూరులో సమస్యలను అడిషనల్ ఎస్పీ అడిగి తెలుసుకున్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

సైబర్ నేరాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని అడిషనల్ ఎస్పీ సూచించారు. సైబర్ నేరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అప్రమత్తత గురించి ఆయన అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా పాటించాల్సిన భద్రత నియమాలు, హెల్మెట్, సీటు బెల్టులు ధరించడం వల్ల కలిగే ఉపయోగాలపై అవగాహన కల్పించారు. మహిళలు, చిన్నారులకు పోలీసు లెప్పుడూ అండగా ఉంటారన్నారు. వారితో అసభ్యకరంగా వ్యవహరించినా, వెంటపడినా, వేధింపులకు గురి చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో రూరల్ సర్కిల్ సీఐ మల్లికార్జునరావు, ఎస్ఐ వినోద్‌బాబు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

కాశీ విశ్వేశ్వరుడికి పూజలు



కర్లపాలెం: పవిత్ర కార్తిక మాసం సందర్భంగా యాజలిలోని త్రిదేవాలయ ప్రాంగణంలో ఉన్న శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో శనివారం అభిషేకాలు, అర్చనలు విశేష పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కర్లపాలెం మండల సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు, యాజలి మాజీ సర్పంచ్ గుండ్రెడ్డి శివ, అనూరాధ దంపతులు, కుమార్తె లక్ష్మీదుర్గ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి శివాలయంలో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులతో కలసి శివ దంపతులు కార్తిక దీపాలతో పాటు 11 కేజీల కర్పూర మహా జ్యోతిని వెలిగించారు. అనంతరం ఆలయం వద్ద సుమారు మూడు వేల మందికి అన్నసంతర్పణ చేశారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో వేదశ్రీకి పతకం



చీరాల టౌన్: సౌత్ ఇండియా పవర్ లిఫ్టింగ్ పోటీల్లో చీరాలకు చెందిన ఇంటర్ విద్యార్థిని త్రిపురం వేదశ్రీ మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించింది. నవంబర్ 24 నుంచి 27 వరకు తమిళనాడు రాష్ట్రం సేలంలో పోటీలు నిర్వహించారు. ఇందులో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్నాటక రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీలో వేదశ్రీ మొత్తం 227.5 కిలోలు బరువును ఎత్తి తృతీయ స్థానంలో నిలిచింది. 69 కేజీల విభాగంలో స్క్వాట్ 95 కిలోలు, బెంచ్‌ప్రెస్ 47.5 కిలోలు, డెడ్ లిఫ్ట్ 85 కిలోలు బరువుతో అందరిని ఆకట్టుకుంది. వేదశ్రీ తృతీయ స్థానంలో నిలిచి చీరాలకు, రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచిందని అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ఆమెను శనివారం బాపట్ల జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు టీఎస్ఆర్ చంద్రశేఖర్‌రెడ్డి, సెక్రటరీ ప్రసాద్, జిల్లా చైర్మన్ తాడివలస దేవరాజ్, జాయింట్ సెక్రటరీ లక్ష్మణ అంబేశ్వరరెడ్డి ఉన్నారు.

బగళాముఖిని దర్శించుకున్న ప్రముఖులు



చందోలు(కర్లపాలెం): చందోలు శ్రీ బగళాముఖి అమ్మవారిని శనివారం పలువురు వీఐపీలు దర్శించుకుని పూజలు చేశారు. కార్తిక మాసం అమావాస్య సందర్భంగా దేవస్థానంలో 70వ అమావాస్య వామదివ్య కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి అర్చనలు, అష్టోత్తర శతనామావళి విశేష పూజలు జరిగాయి. రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ ఎస్. సత్యనారాయణ కుటుంబ సభ్యులు, రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మల్లికార్జున దంపతులు, ఇన్‌కమ్ ట్యాక్స్ కమిషనర్ దేశ్‌పాల్‌సింగ్ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి పలు పూజలు నిర్వహించారు. దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సూర్యప్రకాశరావు స్వాగతం పలికారు. ఆలయ విశిష్టతలను వివరించి, అమ్మవారి చిత్రపటాలతో పాటు ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భ్రమరాంబికాదేవికి వెండి హస్తాలు వితరణ



రెంటచింతల: మండలంలోని సత్రశాల వద్ద వేంచేసిన అతి పురాతనమైన శైవక్షేత్రంగా విరాజిల్లుతున్న గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలోని అమ్మవారికి మిర్యాల గ్రామానికి చెందిన అలవాల నర్సిరెడ్డి, మంగమ్మ, శ్రీనివాసరెడ్డి, అరుణ, నీరజ్ రెడ్డి, నిఖిలారెడ్డి దంపతులు వెండి హస్తాలు శనివారం అందజేశారు. కార్తికమాసం సందర్భంగా శనివారం దేవస్థానంలోని అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. దర్శనానికి వేలాది మంది భక్తులు తరలివచ్చారు.

ఉమ్మడి జెడ్పీ వార్షిక బడ్జెట్ రూ.643.80 కోట్లు

- 2025-26 బడ్జెట్ ప్రతిపాదనలకు స్థాయీ సంఘం ఆమోదం
- త్వరలో జరగనున్న సర్వసభ్య సమావేశానికి బడ్జెట్ ప్రతిపాదనలు
- రూ.తొమ్మిది కోట్లతో గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఆమోదం
- ఏడాది గడిచినా ప్రారంభం కాని పనులు రద్దుకు నిర్ణయం



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా

గుంటూరుఎడ్యుకేషన్: ఏడు స్థాయీ సంఘాలకు గాను ప్రణాళిక-ఆర్థిక, గ్రామీణాభివృద్ధి, విద్య-వైద్యం, అభివృద్ధి పనులకు సంబంధించిన 1, 2, 4, 7వ స్థాయీ సంఘ సమావేశాలు జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన ఆమె చాంబర్లో నిర్వహించారు. వ్యవసాయంపై 3వ స్థాయీ సంఘం సమావేశం జెడ్పీ వైస్ చైర్మన్ శొంటిరెడ్డి నర్సిరెడ్డి, స్త్రీ-శిశు సంక్షేమంపై 5వ స్థాయీ సంఘం సమావేశం తెనాలి జెడ్పీటీసీ పిల్లి ఉమా ప్రణతి, సాంఘిక సంక్షేమంపై 6వ స్థాయీ సంఘం సమావేశం జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బత్తుల అనూరాధల అధ్యక్షతన జరిగాయి.

వార్షిక బడ్జెట్ ఇదీ..

2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.643.80 కోట్లతో రూపొందించిన బడ్జెట్‌లో జెడ్పీ సాధారణ బడ్జెట్ రూ.71.11 కోట్లు. మిగిలిన రూ.572.69 కోట్లు పంచాయతీరాజ్, ఇంజినీరింగ్, గ్రామీణ నీటి సరఫరా విభాగాలకు సంబంధించినవి. పీఆర్ ఇంజినీరింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల వార్షిక బడ్జెట్ అంచనాలను జెడ్పీ ఆమోదించాల్సి ఉండటంతో స్థాయీ సంఘ సమావేశంలో ప్రవేశపెట్టారు.

గ్రామాల్లో పనులపై దృష్టి

జెడ్పీటీసీల విజ్ఞప్తి మేరకు రూ.9 కోట్ల వ్యయంతో గ్రామాల్లో 108 అభివృద్ధి పనులు చేపట్టేందుకు సమావేశంలో ఆమోదించారు. జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో ప్రజా అవసరాల మేరకు గతంలో ఆమోదించిన వివిధ అభివృద్ధి పనుల ప్రగతిని ఆయా శాఖల అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. టెండర్లు దక్కించుకుని, ఏడాది గడిచినా ప్రారంభించని అభివృద్ధి పనులను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. అదే విధంగా 35 మండల పరిషత్‌లకు చెందిన వార్షిక బడ్జెట్ అంచనాలను ఆమోదించారు. కాగా పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలతోపాటు వివిధ శాఖల వారీగా గతంలో కేటాయించిన అభివృద్ధి పనులకు సంబంధించి ఏడాది గడిచినా పనులు ప్రారంభానికి నోచుకోని విషయాన్ని గుర్తించారు. ప్రగతిని ఆయా శాఖల అధికారులు వివరించారు. కార్యక్రమంలో సీఈవో వి.జ్యోతిబసు పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు

- ముగ్గురికి గాయాలు
- బస్సులో 30 మంది ప్రయాణికులు



బాధితులను అద్దంకి వైద్యశాలకు తరలిస్తున్న హైవే అంబులెన్స్

జే.పంగులూరు: ముందు వెళ్తున్న లారీని ట్రావెల్ బస్సు ఢీకొట్టడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈఘటన మండలంలోని ముప్పవరం గ్రామం 16వ జాతీయ రహదారిపై శనివారం ఉదయం జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. చెన్నై నుంచి ఒడిషా వైపు లారీ పౌడర్ లోడుతో వెళ్తోంది. ఈ సమయంలో ప్రైవేటు ట్రావెల్స్ బస్సు పులివెందుల నుంచి విజయవాడ వైపు వెళ్తోంది. సరిగా ముప్పవరంలోని ఫ్లైవర్ వద్దకు వచ్చేసరికి ట్రావెల్స్ బస్సు ముందు వెళ్తున్న లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సులో మొత్తం 30 మంది ప్రయాణికులు ఉన్నారు. వారిలో విజయవాడకు బెంజి సర్కిల్‌కు చెందిన బండారు కీర్తి, పులివెందుల మండలం మల్లెల గ్రామానికి చెందిన మహ్మద్ రఫీ, రేపల్లెకు చెందిన వైష్ణవీలకు స్వల్పగాయాలయ్యాయి. వీరిని వైద్య చికిత్స నిమిత్తం హైవే అంబులెన్స్‌లో అద్దంకి వైద్యశాలకు తరలించారు. స్థానిక పోలీసులు ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్లు త్వరితగతిన పూర్తిచేయాలి


జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి



హెలిప్యాడ్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటన ఏర్పాట్లను త్వరితగతిన పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి అధికారులకు తెలిపారు. పోలీస్ కవాతు మైదానంలో ఏర్పాటుచేసిన హెలిప్యాడ్ ప్రాంతాన్ని ఆయన జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా అదనపు ఎస్పీ టి.పి. విఠలేశ్వర్‌తో కలిసి శనివారం పరిశీలించారు. హెలిప్యాడ్ నుంచి సీఎం హాజరయ్యే కార్యక్రమ వేదిక వరకు కాన్వాయ్ వెళ్లే మార్గాన్ని పరిశీలించారు. ఉన్నత పాఠశాల వెనుకవైపున్న సమీకృత గిరిజన సంక్షేమ బాలికల వసతి గృహాన్ని పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా మార్గంలో ఉన్న వసతి గృహాన్ని పరిశీలించే అవకాశం ఉన్న నేపథ్యంలో వంటగది, మరుగుదొడ్లు, వసతులను ఆయన పరిశీలించారు. వసతి గృహాన్ని పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. విద్యార్థినుల గదిలో ఫ్యాన్లు, లైట్లు తప్పనిసరిగా ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. అనంతరం మున్సిపల్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ మీటింగ్ కోసం ప్రాంగణాన్ని సిద్ధం చేయాలని తెలిపారు. పాఠశాలలో తరగతి గదులు, వంటగది, మరుగుదొడ్లను పరిశీలించారు. అనంతరం అధికారులతో పాఠశాలలోనే సమీక్ష నిర్వహించారు. విద్యార్థుల సమగ్ర ప్రగతి పత్రాలపై తల్లిదండ్రులతో నిర్వహించే చర్చా కార్యక్రమం వారికి ప్రయోజనకరం అయ్యేలా చూడాలని జిల్లా కలెక్టర్ చెప్పారు. పాఠశాలలో ఉన్న 919 మంది విద్యార్థులు తల్లిదండ్రులకు ఆహ్వానం పంపాలని తెలిపారు. పూర్వ విద్యార్థులను ఆహ్వానించాలన్నారు. ముఖ్యమంత్రి హాజరయ్యే కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులే యాంకరింగ్ చేపట్టేలా చైతన్య పరచాలని తెలిపారు. పాఠశాల అంతా పూలతో సుందరీకరణ చేపట్టాలని, పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. మున్సిపాలిటీ సిబ్బంది పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పోలీస్ కవాతు మైదానం నుంచి మున్సిపల్ ఉన్నత పాఠశాల వరకు పటిష్టమైన భద్రత కల్పించాలని తెలిపారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా పోలీస్ అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జి. గంగాధర్ గౌడ్, డీఈవో పురుషోత్తం, పలు శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలి



కొవ్వొత్తుల ప్రదర్శనలో జిల్లా కలెక్టర్, అధికారులు

బాపట్ల: ఎయిడ్స్‌పై సమాజంలోని ప్రతి ఒక్కరికీ వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని కలెక్టర్ జె.వెంకట మురళి పేర్కొన్నారు. వరల్డ్ ఎయిడ్స్ డే సందర్భంగా శనివారం రాత్రి బాపట్లలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. హెచ్ఐవీ, ఎయిడ్స్‌తో మరణించిన వారికి సంఘీభావం తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారిణి విజయమ్మ, మున్సిపల్ కమిషనర్ రఘునాథ రెడ్డి పాల్గొన్నారు.

ప్రారంభమైన పల్నాటి వీరారాధన ఉత్సవాలు

- ఎర్ర జెండా ప్రతిష్టించి ఉత్సవాలను ప్రారంభించిన పీఠాధిపతి
- ముగిసిన రాచగావు క్రతువు



వీరుల గుడిపై ఎర్ర జెండా ప్రతిష్టిస్తున్న పీఠాధిపతి కేశవ

కారెంపూడి: పల్నాటి రణక్షేత్రం కార్యమపూడి (కారెంపూడి)లో పల్నాటి వీరుల ఆరాధన ఉత్సవాలు కార్తిక అమావాస్య శనివారం ప్రారంభమయ్యాయి. వీరుల గుడికి ఎరుపు తెలుపు చారలతో వెల్ల వేశారు. తర్వాత ఆయుధాలను బయటకు తీసి గుడి మొత్తాన్ని శుద్ధి పరచారు. ఆయుధాలను కూడా కడిగి శుభ్రం చేశారు. మరో వైపు వివిధ ప్రాంతాల నుంచి వీరాచారులు వీరుల గుడి ప్రాంగణానికి చేరుకుంటున్నారు. వచ్చిన వారు ముందుగా కళ్లి పోతురాజు దర్శనం చేసుకున్నారు అక్కడ నుంచి వీరుల గుడికి చేరుకుని నాగులేరు గంగధారిలో తమ ఆయుధాలను శుద్ధి పరుచుకున్నారు. అనంతరం రాత్రి వీరుల ఆయుధాలకు నూతన వస్త్రాలతో అలంకరించుకుని ఊరేగింపుగా బయలుదేరి చెన్నకేశవస్వామి, అంకాలమ్మ తల్లిని దర్శించుకున్నారు. అక్కడ నుంచి పీఠాధిపతి పిడుగు తరుణ్ చెన్నకేశవ ఇంటికి వెళ్లి ఆయనను ఊరేగింపుగా తీసుకుని వీరుల గుడి ప్రాంగణానికి చేరుకున్నారు. అనంతరం రాత్రి వీరుల గుడి ముఖ మండపంపై పీఠాధిపతి తరుణ్ చెన్నకేశవ ఎర్ర జెండాను ప్రతిష్టించారు. తర్వాత వచ్చిన వీరాచారులకు పీఠాధిపతి వీరుల గుడికి తూర్పున ఉన్న మండపంలో కంకణాల ధారణ చేశారు. రణక్షేత్రం ఉత్సవ శోభను సంతరించుకుంది. వీరుల గుడి ప్రాంగణమంతా సందడిగా మారింది. అంకాలమ్మ తల్లి, చెన్నకేశవస్వామి దేవాలయం, ఇతర పల్నాటి చారిత్రక చిహ్నాలకు ఆకర్షణీయంగా ఎరుపు తెలుపు చారలతో సంప్రదాయ రంగులు వేశారు. చెన్నకేశవుని నూతన వస్త్రాలతో అలంకారం చేశారు.

ముగిసిన తొలి ఘట్టం రాచగావు

తొలి రోజు 'రాచగావు'తో ప్రారంభమైంది. పోతురాజుకు దిబ్బం పెట్టి వీరుల ఆత్మశాంతికి ముద్దలు సమర్పించారు. వీరుల గుడి పూజారులు పోతురాజు ఆచారవంతునితో కలసి పోతురాజుకు గావు చెల్లించారు. ప్రస్తుతం జంతుబలులపై నిషేధం ఉన్న కారణంగా అన్నం ముద్దలను నెత్తురులో కలిపి పోతురాజుకు తర్వాత వీరుల ఆత్మలకు ముద్దలుగా చేసి అర్పించారు. రాత్రి బాగా పొద్దుపోయాక రాచగావు కథను దర్శి ముక్కంటి అనే వీరవిద్యావంతుడు ఆలపించారు. నేడు ఆదివారం 'రాయబారం' చారిత్రక ఘట్టం పేరుతో ఉత్సవం జరగనుంది.

క్లుప్తంగా

రేపు దివ్యాంగ ఉద్యోగులకు పోటీలు

బాపట్ల: అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని డిసెంబర్ 5న స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ వేడుకలు ప్రతి జిల్లాలో నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవంలో భాగంగా డిసెంబర్ రెండో తేదీన ప్రకాశం జిల్లా ఒంగోలులోని డీఆర్‌ఆర్‌ఎం ఉన్నత పాఠశాలలో క్రీడా పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. హాజరయ్యే దివ్యాంగ ఉద్యోగులకు ఆన్ డ్యూటీగా పరిగణించాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ అవకాశాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకునేలా వీలు కల్పించాలని ఆయన సూచించారు. కలెక్టరేట్‌లో నిర్వహించే అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవానికి దివ్యాంగులు హాజరుకావాలని ఆయన కోరారు.

భార్య మందలించిందని ఆత్మహత్య

చిలకలూరిపేట టౌన్: భార్య మందలించిందని భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన పట్టణంలో ఆదివారం జరిగింది. స్థానిక బచ్చు ఆదినారాయణ వీధిలో నివాసం ఉండే బూసి రత్నం (45) ప్లంబర్‌గా పని చేస్తాడు. ఇటీవల భార్యాభర్తల మధ్య చిన్న గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెందిన రత్నం కుటుంబ సభ్యులు ఇంట్లో లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మధ్యాహ్నం భోజనానికి వచ్చిన పెద్ద కుమారుడు రాజు ఇంటి తలుపు తెరిచి చూడగా తండ్రి ఆత్మహత్య చేసుకోవడం గమనించాడు. పోలీసులకు సమాచారం అందించగా సంఘటనా స్థలాన్ని చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ ఎస్‌ఐ తెలిపారు.

గారడీలు బాబుకు వెన్నతోపెట్టిన విద్య

- వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గణేష్
- విద్యుత్ చార్జీలు పెంచి వసూళ్లకు పాల్పడటమేనా సంపద సృష్టి
- పేద, మధ్యతరగతి ప్రజలపై భారాలు మోపటం తగదు



రేపల్లె రూరల్: కల్లబొల్లి మాటలతో గారడీ విద్యలు చేయడం ముఖ్యమంత్రి చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్యేనని వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఈవూరు గణేష్ ధ్వజమెత్తారు. చెరుకుపల్లి మండలం గుళ్లపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. అధికారంలోకి వస్తే ప్రజలపై భారాలు మోపమని, విద్యుత్ చార్జీలను పెంచే ప్రసక్తే లేదని ఎన్నికల ముందు ప్రగల్భాలు పలికిన చంద్రబాబు నేడు వాటిని పెంచి పేదలపై మోయలేని భారాలు మోపుతున్నారని విమర్శించారు. చంద్రబాబు హామీలు నీటి మూటలేనని తేటతెల్లం చేస్తూ సూపర్ సిక్స్ పేరుతో ఇచ్చిన హామీలను తుంగలోకి తొక్కారని తెలిపారు. ఆడలేక మద్దెల దరువు అన్నట్లు తాను చేసే తప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకు గత ప్రభుత్వంపై నిందలు వేయడం ఆయనకు పరిపాటిగా మారిందని విమర్శించారు. తానా అంటే తందానా అనేలా పచ్చమూకలతో పాటు ఎల్లో మీడియా చంద్రబాబు తప్పులను కప్పిపుచ్చుతూ ప్రజల ఆలోచనలు దారి మళ్లించేలా ప్రతిపక్షాలపై బురద చల్లుతున్నాయని తెలిపారు. అధికారంలోకి వస్తే సంపద సృష్టిస్తామని గొప్పలు చెప్పిన చంద్రబాబు నేడు నిత్యావసర వస్తువులు, విద్యుత్ చార్జీలు పెంచి ప్రజల నడ్డి విరుస్తున్నారన్నారు. రేట్లు పెంచి పన్నులు విధించటమేనా సంపద సృష్టి ? అని డాక్టర్ గణేష్ ప్రశ్నించారు. ప్రభుత్వాన్ని నడిపేందుకు వివిధ రకాల చార్జీల పేరుతో ప్రజల నుంచి వసూళ్ల పర్వానికి చంద్రబాబు తెగబడుతున్నాడని మండిపడ్డారు. ఇప్పటికే సర్దుబాటు చార్జీల పేరుతో రూ.6073కోట్లను వసూలు చేసిన చంద్రబాబు మరలా ప్రజలపై అధిక మొత్తంలో విద్యుత్ భారాలను మోపేందుకు సిద్ధపడటం సిగ్గుచేటని ఖండించారు. చంద్రబాబు నిర్ణయంతో నేడు ప్రజలపై రూ.9412కోట్ల భారం పడబోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన చంద్రబాబు నేడు మోడీ ధ్యానం చేస్తూ ఆయనకు దాసోహమై స్మార్ట్‌మీటర్లను రాష్ట్రంలోకి ఆహ్వానించారని ధ్వజమెత్తారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో అనేక సాంకేతిక సమస్యలు తలెత్తుతాయని, వినియోగదారులకు నష్టం తప్పలాభం లేదని తెలిపారు. ఇప్పటికైనా చంద్రబాబు ప్రజలపై విద్యుత్ భారాలను మోపే ఆలోచనలను విరమించుకోవాలని, లేనిపక్షంలో ప్రజలే బుద్ధి చెబుతారని డాక్టర్ గణేష్ హితవు పలికారు.

ఈపూరుపాలెంలో పేట్రేగిన దొంగలు



సీసీ టీవీ ఫుటేజీను పరిశీలిస్తున్న సీఐ శేషగిరిరావు



చోరీకి పాల్పడుతున్న దొంగ

మీసేవా కేంద్రంతో పాటు మూడు షాపులలో చోరీ

చీరాల: నియోజకవర్గంలో దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. మండలంలోని ఈపూరుపాలెం మెయిన్ రోడ్డులో వరుస షాపుల్లో శనివారం తెల్లవారుజామున స్వైరవిహారం చేశారు. తాళాలు పగులకొట్టి అందినకాడికి దోచుకెళ్లారు. మీ సేవా కేంద్రం తాళాలు పగలగొట్టి సుమారు రూ.30 వేలు అపహరించారు. దాని పక్కనే ఉన్న మరో మూడు షాపుల తాళాలు పగులగొట్టి నగదు దోచుకున్నారు. దీంతో షాపుల యాజమానులు పోలీసులకు సమాచారం అందించారు. రూరల్ సీఐ శేషగిరిరావు, ఎస్‌ఐ అంబటి చంద్రశేఖర్ ఘటనా స్థలానికి చేరుకుని షాపులను పరిశీలించారు. క్లూస్ టీం సిబ్బంది వేలిముద్రలు సేకరించారు. మీసేవా కేంద్రం తాళాలు పగలగొట్టి నగదు అపహరిస్తూ చోరీకి పాల్పడిన దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. ఫుటేజ్ ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. తెల్లవారుజాము సమయంలో దొంగల బీభత్సం సృష్టించడంతో షాపుల యజమానులు ఆందోళనకు గురవుతున్నారు.

ఫొటోగ్రఫీలో బాపట్లవాసికి బంగారు పతకం



బంగారు పతకం అందుకుంటున్న నాగరాజు



అవార్డుకు ఎంపికైన ఫొటో

బాపట్ల టౌన్: జాతీయస్థాయి ఫొటోగ్రఫీలో బాపట్ల మండలం, ముత్తాయపాలెం గ్రామానికి చెందిన పీవీఎస్ నాగరాజుకు బంగారం పతకం లభించింది. 132వ ప్రపంచ పిక్టోరియల్ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆచార్య నాగార్జున యునివర్సిటీలో ఇండియన్ ఇంటర్నేషనల్ ఫొటోగ్రఫీ కౌన్సిల్, ఫొటోగ్రఫీ అకాడమి ఆఫ్ ఇండియా సంయుక్తంగా ఈనెల 10 నుంచి 24 వరకు పోటీలు నిర్వహించింది. ఇందులో పీవీఎస్ నాగరాజు తీసిన గిరిజనుల జీవన శైలిని తెలియజేసే ఫొటోకు జాతీయ స్థాయిలో బంగారం పతకం లభించింది. శనివారం ఏఎన్‌యూలో జరిగిన కార్యక్రమంలో పతకంతోపాటు పి. శేషుబాబు మెమోరియల్ అవార్డును ప్రొఫెసర్ కె. రామమోహన్‌రావు నుంచి మీదుగా అందుకున్నారు. అనంతరం నాగరాజును ఏఎన్‌యూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె. గంగాధర రావు, ఆర్ట్స్ కామర్స్ అండ్ లా ప్రిన్సిపాల్ ఎం. సురేష్‌కుమార్, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్స్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హెడ్ డాక్టర్ జె. మధుబాబు, ఐఐపీసీ డిజిటల్ ఫోటో జర్నలిజం విభాగం చైర్మన్ తుమ్మా శ్రీనివాసరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

దశరథ రామారావు సేవలు ప్రశంసనీయం

జిల్లా అడిషనల్ ఎస్పీ టి.పి. విఠలేశ్వర్



దశరథ రామారావు దంపతులను సన్మానిస్తున్న విఠలేశ్వర్

బాపట్ల టౌన్: మూడు దశాబ్దాలకు పైగా పోలీస్ శాఖలో దశరథ రామారావు సేవలు ప్రశంసనీయమని జిల్లా అడిషనల్ ఎస్పీ టి.పి. విఠలేశ్వర్ తెలిపారు. చీరాల టౌన్‌లో ఏఎస్‌ఐగా విధులు నిర్వర్తిస్తూ శనివారం పదవీ విరమణ చేసిన దశరథ రామారావును జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ 1992లో సివిల్ కానిస్టేబుల్‌గా చేరిన దశరథ రామారావు నిబద్ధత, అంకితభావంతో విధులు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. పదవీ విరమణ తరువాత ఆరోగ్యంపై దృష్టి సారిస్తూ కుటుంబ సభ్యులతో సంతోషంగా, ఆహ్లాదకరంగా గడపాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఏవో శ్రీనివాసరావు, వెల్ఫేర్ ఆర్.ఐ శ్రీనివాసరెడ్డి, అడ్మిన్ ఆర్.ఐ మౌలుద్దీన్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

ఎడ్ల పోటీల విజేత పెదపరిమి, తుళ్లూరు జత

కారెంపూడి: పల్నాటి వీరారాధన ఉత్సవాల సందర్భంగా జరుగుతున్న రాష్ట్రస్థాయి ఎడ్ల పోటీలలో ఆరు పళ్ల విభాగంలో తుళ్లూరు మండలం పెదపరిమికి చెందిన మోదుగుల రామిరెడ్డి, కొల్లిపరకు చెందిన గుదిబండి కృష్ణ కిశోర్‌రెడ్డి కంబైన్డ్ జత 3,200 అడుగుల దూరం బండ లాగి ప్రథమ స్థానం కైవసం చేసుకున్నాయి. ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడుకు చెందిన గరికపాటి లక్ష్మయ్య చౌదరి ఎడ్ల జత 2,812 అడుగుల దూరం లాగి ద్వితీయ స్థానంలో నిలిచాయి. పల్నాడు జిల్లా పెదకూరపాడుకు చెందిన ఏటుకూరి శ్రీనివాసరావు ఎడ్లజత తృతీయ స్థానాన్ని, గురజాలకు చెందిన లింగా అంజయ్య చౌదరి, ధరణి ఎడ్ల జత 4వ స్థానంలో, నకరికల్లు మండలం చల్లగుండ్లకు చెందిన మేకా అంజిరెడ్డి ఎడ్ల జత 5వ స్థానంలో నిలిచింది. పల్నాడు జిల్లా నూజెండ్ల మండలం రెడ్డిపాలేనికి చెందిన పిడవర్తి శ్రీనివాసరెడ్డి, జక్కిరెడ్డి సుబ్బారెడ్డి ఎడ్ల జత 6వ స్థానంలో నిలిచాయి. విజేతలకు నగదు బహుమతులను దాతలు పంగులూరి అంజయ్య, ప్రజ్వల్ సీడ్స్, లిటిల్ హైబ్రిడ్ సీడ్స్, లీలాలక్ష్మి తండా చిన సైదా, ముద్దంగుల బాల వెంకటేశ్వర్లు, మహంకాళి శ్రీను, ఉన్నం శ్రీనివాసరావు, కిల్లి సాంబయ్య, వల్లెపు బాబులు అందించారు. కారెంపూడి రైతు సంఘం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యం

లక్ష్మీపురం: ప్రయాణికులకు వసతుల కల్పనలో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు గుంటూరు రైల్వే డివిజన్ సీనియర్ డీసీఎం డాక్టర్ ప్రదీప్‌కుమార్ అన్నారు. పట్టాభిపురంలోని గుంటూరు రైల్వే డీఆర్‌ఎం కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని 4 రైళ్లకు బెడ్ రోల్స్ సరఫరా అవుతున్నాయని, వాటితోపాటు దుప్పట్లను ప్రతి నెలా శుభ్రం చేస్తున్నట్లు తెలిపారు. సీనియర్ డివిజనల్ మెకానికల్ ఇంజినీర్ మద్దాలి రవికిరణ్, ఏడీఎంఈ బాపయ్య, డీసీఎం కమలాకర్‌బాబు పాల్గొన్నారు.

తండ్రిని చంపిన తనయుడి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ కృష్ణయ్య

అద్దంకి రూరల్: తండ్రిని చంపి పరారైన తనయుడిని శనివారం పోలీసులు అరెస్టు చేశారు. సీఐ కృష్ణయ్య వివరాల మేరకు.. అద్దంకిలోని భాగ్యనగర్‌లో నివాసం ఉంటున్న ముప్పవరపు వెంకటేశ్వర్లు (64) లారీ క్లీనర్‌గా పనిచేసి, కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి వద్దనే ఉంటున్నాడు. భార్య 15 సంవత్సరాల క్రితమే చనిపోవటంతో కుమారుడు సుబ్బారావుతో కలిసి ఉంటున్నాడు. సుబ్బారావు ఏ పనులు చేయకుండా తిరుగుతూ మద్యానికి బానిసయ్యాడు. ఇటీవల మృతుడి స్వగ్రామంలోని పొలాన్ని అమ్మటంతో రూ. 9 లక్షల వరకు వచ్చాయి. వాటితోనే తండ్రీకొడుకు జీవనం సాగిస్తున్నారు. మద్యానికి బానిసైన సుబ్బారావు డబ్బుల కోసం అప్పుడప్పుడు తండ్రిపై దాడిచేసి తీసుకునే వాడు. ఇదే క్రమంలో నవంబర్ 25న రాత్రి డబ్బు కోసం తండ్రిపై దాడి చేయటంతో తలకు తీవ్ర గాయమై మృతి చెందాడు. దీంతో పరారైన సుబ్బారావును శనివారం స్థానిక కలవకూరు రోడ్డులో పట్టుకుని, అరెస్టు చేసి కోర్టు హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు.

మహిళలపై పెరుగుతున్న దాడులు, హత్యలు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు డి. రమాదేవి



బహిరంగ సభలో మాట్లాడుతున్న రమాదేవి

బాపట్ల టౌన్: దేశంతో పాటు రాష్ట్రంలో మహిళలపై దాడులు, హత్యలు రోజురోజుకు పెరిగి పోతున్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి. రమాదేవి ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణంలోని రథం బజార్ సెంటర్‌లో శనివారం రాత్రి సీపీఎం జిల్లా మహాసభలు నిర్వహించారు. తొలుత పట్టణంలో అంబేడ్కర్ విగ్రహం నుంచి పాత బస్టాండు, తవ్వ కాలువ సెంటర్ మీదుగా రథం బజార్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కళాకారులు విప్లవ గీతాలు ఆలపించారు. ఎరజెండాలతో బాపట్ల పట్టణం ఎరుపెక్కింది. రథం బజార్ సెంటర్‌లో జరిగిన జిల్లా మహాసభల బహిరంగ సభలో డి. రమాదేవి మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ తక్షణమే రేషన్ కార్డులు మంజూరుచేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రైతు ఆత్మహత్యలు నివారించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. రాష్ట్రంలో విద్యుత్ స్మార్ట్ మీటర్లు పెట్టడాన్ని తక్షణమే నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. కూటమిలో ఉన్న టీడీపీ, జనసేన పార్టీలు బీజేపి నేతలను ఒప్పించి రాష్ట్ర అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. ఎందరో త్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు కర్మాగారం ప్రవేటీకరణ వెంటనే నిలుపుదల చేయాలని కోరారు. మహిళల మీద దాడులు,హత్యలు పెరుగుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. బాపట్ల జిల్లా కార్యదర్శి సీహెచ్.గంగయ్య మాట్లాడుతూ నూతన బాపట్ల జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం జిల్లాలో ఇద్దరు మంత్రులు,మిగిలిన ప్రజాప్రతినిధులు పూనుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు నూతలపాటి కోటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు టి.కృష్ణమోహన్, సీహెచ్.మజుందార్, సీహెచ్. మణిలాల్, ఎస్.బాబూరావు, నేతలు కె.శరత్, టి.వెంకటేశ్వర్లు, పి.మనోజ్, జి. సుధాకర్, వి.వెంకట్రామయ్య , జిల్లా మహాసభల ఆహ్వాన కమిటీ అధ్యక్షులు జెడ్ బాషా, వామపక్ష నాయకులు పాల్గొన్నారు.